క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శ్రీనివాస్

విజయనగరం అర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీపీఆర్(కార్డియో పల్మనరీ రీసస్టియేషన్)పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ కె.రేఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుండెపోటు సమయంలో ఊపిరి ఆగిపోకుండా చేపట్టాల్సిన చర్యలను వైద్యుడు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు పద్మజ, విజయనగరం రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



విద్యార్థుల నుదుట తిలకం దిద్ది రాఖీలు కడుతున్న చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర

విజయనగరం: నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్ సమీపంలోని బధిరుల పాఠశాలలోని విద్యార్థులతో కలిసి చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర..ముందస్తు రక్షాబంధన్ వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకలో అక్కడి విద్యార్థుల చేతులకు రాఖీలు కట్టి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేట షిర్డీసాయిబాబా ఆలయంలోని భక్తులకు గురువారం అన్నదానం చేశారు. కొవ్వాడ గ్రామ సర్పంచ్ కోట్ల రఘు చేసిన ఆర్థికసాయంతో భక్తులు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం సర్పంచ్ దంపతులను ఆలయ నిర్వాహకులు సన్మానించారు.

ట్రాఫిక్ మళ్లింపు

విజయనగరం టౌన్: వరలక్ష్మీవ్రత పూజల నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. గురువారం పూజసామగ్రి కొనుగోళ్లకు వచ్చిన జనాలతో నగరంలోని గంటస్తంభం ప్రాంతం కిటకిటలాడింది. ట్రాఫిక్ జామ్ అవ్వకుండా కేవలం ద్విచక్ర వాహనాలను మాత్రమే గంటస్తంభం వైపు అనుమతించారు. ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలను అస్సలు రానివ్వలేదు. ఎంఆర్ కళాశాల వరకు మాత్రమే ఆటోలకు అనుమతి ఇచ్చారు. మూడులాంతర్ల జంక్షన్ మీదుగా నాలుగు చక్రాల వాహనాలను అనుమతించారు.

మద్యంసీసాల స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లిలో ఓ వ్యక్తి వద్ద అనధికారికంగా ఉన్న 12 మద్యం సీసాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా ఎవరైనా మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భోగాపురం ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పూలు, పండ్ల ధరలకు రెక్కలు

విజయనగరం టౌన్: శ్రావణమాసం నేపథ్యంలో పూలు, పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నెలలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తుండడంతో పూజలకు పూలు, పండ్లు అవసరం కాగా వాటి కొనుగోళ్లకు మహిళలు పోటీపడుతున్నారు. నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి గంటస్తంభం, మూడులాంతర్ల జంక్షన్, నగర కార్పొరేషన్ కార్యాలయం వరకు ఉన్న వ్యాపార దుకాణాలు కొనుగోళ్లదారులతో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో పూజసామగ్రి, పండ్లు, పూలు ధరలు అమాంతం పెరిగిపోయాయి. చామంతి పువ్వులు పావు కిలో రూ.400, కొబ్బరి టెంకాయ రూ.40, డజను అరటి పండ్లు రూ.120, బత్తాయి, యాపిల్ పండ్లు రూ.150 నుంచి రూ.200 ధర పలుకుతోంది.

విద్యార్థులకు యూనిఫాం వితరణ



విద్యార్థులకు యూనిఫాం దుస్తులు అందజేస్తున్న దాతలు

రాజాం సిటీ: మండలంలోని మొగిలివలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన యువకులు వైట్ అండ్ వైట్ యూనిఫాం దుస్తులను గురువారం అందించారు. ఈ ఏడాది కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు వైట్ యూనిఫాం అందించామని యువకులు కె.సూర్యనారాయణ, గణనాథ, రమణమూర్తి, ఏ.హరి తెలిపారు. యువకులను ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, మొయ్యి శ్రీరాములు, పీఎంసీ చైర్‌పర్సన్ రమణమ్మ అభినందించారు.

శ్రావణ శోభ

- వరుస పండగలతో సందడిగా మార్కెట్
- అమాంతం పెరిగిన పూజా సామగ్రి ధరలు
- పెళ్లిళ్లు, శుభకార్యాలతో పెరిగిన కొనుగోళ్లు



పూజలకు లక్ష్మీదేవి చిత్రపటాలు కొనుగోళ్లు చేస్తున్న మహిళలు



కొనుగోళ్లదారులతో కిక్కిరిసిన పాతబస్టాండ్ రోడ్డు

విజయనగరం: నగరంలో శ్రావణమాసం శోభ ఉట్టిపడుతోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఇదే ప్రధాన వ్యాపార కేంద్రం కావడంతో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కొనుగోళ్లదారులతో ఇక్కడి మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వరుస పండగలు కూడా కావడంతో సందర్శకుల రద్దీతో నగరంలో సందడి వాతావరణం నెలకొంది. బంగారం, పూలు, వస్త్ర వ్యాపారాలు ఊపందుకున్నాయి. శ్రావణమాసంలో మహిళలు చేసే వరలక్ష్మీ వ్రతాలతో పలు వ్యాపారాలకు గిరాకీ ఏర్పడింది. మూడో శ్రావణ శుక్రవారం పూజా కార్యక్రమాలకు అవసరమైన సామగ్రి కొనుగోళ్లకు వచ్చిన వారితో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. ఈ నెల మొత్తం పండగలు, శుభకార్యాలు ఉండడంతో బిజినెస్ అమాంతం పెరిగిపోయింది.

ఈ నెలలో పండగలివే..

ఈ నెల 8న వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 15న స్వాతంత్ర్య దినోత్సవం, 16న కృష్ణాష్టమి, 27న వినాయక చవితి పండగలు. దీంతో ఆయా పండగలకు సంబంధించిన వ్యాపారాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. వరలక్ష్మీవ్రతం మహిళలకు సంబంధించిన పూజలు కాగా అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండగ సామగ్రి కొనుగోళ్లతో నగరంలోని మెయిన్ రోడ్డు, రింగ్‌రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, గంటస్తంభం, కోట, కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్లు ప్రజల రాకపోకలతో అత్యంత రద్దీగా కనిపిస్తున్నాయి.

వ్యాపారాలు ఊపందుకున్నాయి..

గత ఆషాఢంతో పోలిస్తే ఇప్పుడు శ్రావణంలో వ్యాపారాలు ఊపందుకున్నాయి. వస్త్ర రంగంలోకి కార్పొరేట్ సంస్థల రాకతో చిరువ్యాపారుల మనుగడ కాస్త ప్రశ్నార్థకమైంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లు ఇస్తుండడంతో సామాన్యులు సైతం షాపింగ్ మాల్స్‌కు క్యూ కడుతున్నారు. దీంతో చిరు, మధ్య తరగతి వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. ఒక్కోసారి వ్యాపారాలు లేక షాపు అద్దెలు, కరెంట్ బిల్లులు, జీతాలు చెల్లించడం భారమవుతోంది.

–సత్యనారాయణ, వస్త్ర వ్యాపారి

ఆకర్షించే ఆఫర్లు..

శ్రావణమాసం పురస్కరించుకుని, మార్కెట్‌లో పలు ఆఫర్లు కొనుగోళ్లదారులను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. బంగారం, వస్త్ర దుకాణాలు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితం, బంగారు ఆభరణాల కొనుగోళ్లపై తరుగు, మజూరీలో రాయితీ వంటివి అందిస్తున్నాయి. కొన్ని షాపింగ్‌మాల్స్‌లో ఒకటి కొంటే మరొకటి ఉచితం, లక్కీడ్రా, బంపర్ డ్రా అంటూ ఆఫర్లు ఇస్తున్నారు. వీటితో పాటు ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తుండడంతో జ్యువెలరీ, బట్టల షాపులు కొనుగోళ్లదారులతో నిండుగా దర్శనమిస్తున్నాయి.

కొండెక్కిన పూజా సామగ్రి ధరలు..

శ్రావణమాసం పూజల నేపథ్యంలో పూజా సామగ్రి ధరలు కొండెక్కాయి. మహిళలకు ప్రత్యేకమైన ఈ పూజలకు కొబ్బరికాయలు, అరటిపండ్లు, పువ్వులే కాకుండా మిగతా పండ్లు కూడా తప్పనిసరిగా కావాల్సి ఉండడంతో వాటి ధరలు ఇప్పుడు బాగా పెరిగాయి. పండగల సమయాల్లో అమాంతం పెరిగే ధరలతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. పండగ రోజుల్లోనైనా ఇష్టారాజ్యంగా చేస్తున్న వ్యాపారాలపై నియంత్రణ చర్యలు చేపట్టాలని కొనుగోళ్లదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్ని రంగాల్లోనూ జోష్..

శ్రావణమాసం కావడంతో పెళ్లి ముహూర్తాలు కూడా ఉండడంతో కల్యాణ మండపాలు నిర్వహించే వారికి, కేటరింగ్ చేసే వారికి, వంటగాళ్లు, సప్లయి సామాను, లైటింగ్, డెకరేషన్, ఫంక్షన్ హాళ్లు ఇలా అన్ని రంగాల్లోనూ జోష్ కనిపిస్తోంది. అందరికీ చేతినిండా పని, డబ్బులు కూడా అలానే వస్తున్నాయి. దీంతో ఆయా రంగాల వారు బిజీబిజీగా ఉన్నారు.









కొబ్బరికాయలు, గాజులు, అరటిపండ్లు, పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు



పూజా సామగ్రి తరలిస్తూ ఇలా..

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘనంగా నివాళులు

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి గురువారం నిర్వహించారు. లైబ్రేరియన్ వై.మహేష్, పాఠకులంతా కలిసి ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలు, రచనల ద్వారా సమాజాన్ని మేల్కొలిపిన విధానం వక్తలు వివరించారు.

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ స్వగృహంలో వాగ్దేవీ సమారాధనమ్ సంస్థ గౌరవాధ్యక్షుడు జీబీ తిరుమలాచార్యుని సంస్మరణ సభ గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి, తదితరులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కవి, విద్వాంసులు, మన్యం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తిరుమలాచార్యులు అకాల మరణం సాహిత్య రంగానికి తీరని లోటు అని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జంధ్యాల శరత్‌బాబు, ఎలిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మహేష్, పాఠకులు

బాలల భద్రతకు కృషి చేయాలి

విజయనగరం టౌన్: బాలల భద్రతకు కృషి చేయాలని, వారిపై లైంగిక వేధింపులను నిర్మూలిద్దామని చైల్డ్ రైట్స్ ఫోరమ్ కన్వీనర్, జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ సభ్యుడు పి.చిట్టిబాబు పిలుపునిచ్చారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012పై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయసులోపు బాలబాలికలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడితే పోక్సో చట్టం ద్వారా కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇటీవల ఏపీ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం బాలల సంరక్షణ, భద్రతను అత్యంత ప్రధానమైన అంశంగా గుర్తించి, పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలన్నింటిలో బాల,బాలికల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న చైల్డ్ రైట్స్ ఫోరం కన్వీనర్ చిట్టిబాబు

క్రైస్తవ సంఘ కాపరులపై దాడులు విచారకరం



జీవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న క్రైస్తవ సంఘ కాపరులు

విజయనగరం టౌన్: క్రైస్తవ సంఘ కాపరులపై జరుగుతున్న దాడులు అత్యంత విచారకరమని అఖిల భారత పాస్టర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జీవన్‌కుమార్ అన్నారు. స్థానిక పట్టణంలోని కంటోన్మెంట్ లూథరన్ చర్చిలో జిల్లా స్థాయి క్రైస్తవ సంఘ కాపరుల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన..క్రైస్తవులపై దాడులకు ఎగబడుతున్న వారు ఏ మతానికి చెందిన వారూ కాదని, వారంతా మత ఛాందసవాదులని విమర్శించారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం స్పందించి, దళిత క్రైస్తవులకు ప్రత్యేక హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ ఫెడరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. అనంతరం జీవన్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి వి.దేవకుమార్, ఉపాధ్యక్షుడు బి.సుందరరావు, కోశాధికారి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

● పాఠశాల భవనం పూర్తయ్యేదెన్నడో?



పూసపాటిరేగలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడా అని విద్యార్థులంతా ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో పాఠశాల కొత్త భవన నిర్మాణం మంజూరై, పనులు చకచకా జరిగాయి. భవన నిర్మాణం దాదాపు పూర్తి కాగా కేవలం ఫినిషింగ్ టచ్ మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా నిర్మాణంలో పురోగతి కనిపించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 800 మంది విద్యార్థులు చదువుకునే ఈ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉన్నందున అదనపు భవన నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

–పూసపాటిరేగ

హామీల అమలుపై నిలదీయండి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు



చెల్లూరులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం: ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీల అమలుపై నిలదీయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. మండలంలోని చెల్లూరులో జరిగిన కార్యక్రమంలో విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, జిల్లా ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు డోల మన్మధకుమార్‌లు పాల్గొని, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరించి, ఇంటింటికీ పంచిపెట్టారు. గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి వర్గానికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి, పారదర్శకంగా అందివ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికల హామీలన్నీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అందివ్వడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కూటమి సర్కారు గద్దెనెక్కి 14 నెలల కాలం దాటుతున్న వారిచ్చిన అనేక హామీల్లో కనీస హామీలు కూడా అమలు చేయలేదని విమర్శించారు. అధికారం కోసం చంద్రబాబు నోటికొచ్చిన హామీలన్నీ ఇచ్చి, ఇప్పుడు వాటి అమలు విస్మరిస్తున్నారన్నారు. హామీల అమలుపై నిలదీసిన వారిపై కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం మాత్రమే నడుస్తోందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేసేంత వరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో పార్టీ విజయనగరం మండల ప్రధాన కార్యదర్శి గంగిరెడ్ల సూర్యప్రకాష్, కార్యదర్శి లంక వెంకటరావు, ఉపాధ్యక్షులు బోద అప్పలకృష్ణ, సారిక వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలోని 12వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్‌లు విజయలక్ష్మి, శ్రావణి

మోసాలతో అధికారంలోకి..

విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 12, 27, 32వ డివిజన్‌లలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణిలు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి కూటమి కుట్రలు, కుతంత్రాలు, కక్షపూరిత రాజకీయాలను ప్రజలకు తెలిపారు. ప్రతిసారి చంద్రబాబు అబద్ధాలు, మోసాలతోనే అధికారంలోకి వస్తున్నారని, లేనిపోని హామీలతో ప్రజలను ఊదరగొట్టి తీరా ఓట్లు వేయించుకున్నాక హామీల అమలు గాలికొదిలేయడం ఆయనకు అలవాటుగా మారిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో ఎన్ని హామీలిచ్చారు..ఇప్పటివరకు ఎన్ని హామీలు నెరవేర్చారని ప్రశ్నించారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద ఇస్తానన్న రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. ప్రజలంతా చైతన్యవంతులు కావాలని, రాబోయే రోజుల్లో మరోసారి కూటమి మోసాలను నమ్మవద్దని కోరారు. 27, 32 డివిజన్‌లలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా కార్యదర్శి బొద్దాన అప్పారావు, కార్పొరేటర్లు దుప్పాడ సునీత, భోగాపురపు లక్ష్మీరవిచంద్ర తదితరులు పాల్గొని, హామీలు అమలు చేయకుండా కూటమి ప్రజలను చేస్తున్న మోసాలను తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి గురుమూర్తి, మారం బాలబ్రహ్మారెడ్డి, ఎర్రంశెట్టి సునీత, పిన్నింటి సూర్యనారాయణ, అవనాపు లక్ష్మణరావు, కరణం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



32వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సోదరభావంతో సమాజంలో రుగ్మతలు దూరం



జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు రక్షాబంధనం కడుతున్న బ్రహ్మకుమారి



ఎస్పీ వకుల్ జిందల్‌కు రక్షాకంకణం కడుతున్న బ్రహ్మకుమారి

విజయనగరం టౌన్: సోదర భావంతోనే సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలన్నీ దురమవుతాయని బ్రహ్మకుమారీలు పేర్కొన్నారు. రక్షాబంధన్ పురస్కరించుకుని ఎస్పీ వకుల్ జిందల్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌తో పాటు పలువురు అధికారులకు గురువారం రాఖీలు కట్టారు. వృద్ధాశ్రమం, చెవిటిమూగ పాఠశాలలో రక్షాంబంధన్ వేడుకలు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బి.కె.అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాధురి, జ్యోతి, మంజూష, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలను మించిన ఔషధం లేదు..



తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం: తల్లిపాలను మించిన ఔషధం మరొకటి లేదని, ఎన్ని డబ్బులు ఖర్చు చేసినా రాని ఆరోగ్యం ఒక్క తల్లిపాలతోనే వస్తుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఎంపీడీవో లావణ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన తల్లిపాల వారోత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని, అలా అయితే శిశువు రోగనిరోధక శక్తిని కలిగి ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో గాయత్రి, సర్పంచ్ అప్పయ్యమ్మ, వైస్ ఎంపీపీ నాగలక్ష్మి, ఏపీఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com